కథ

# ఓ రాయి ఆత్మకథ

## పుడమి తల్లి పులకింత పర్యవసానమే నా ఆవిర్భవం!

కోటానుకోట్ల వత్సరాలు గడిచిపోయాయి. వదులూ... సముద్రాలే నా నేస్తాలు— సృష్టి ఆరంభంలో, చెట్లు, పుట్టలూ, క్రిమి కీటకాలు, పక్షులూ, జంతువులు... మనిషి... ఇంకా ఎన్నో... ఎన్నెన్నో అద్భుత జీవరాసుల పుట్టుకని, ఆశ్చర్యంగా ఆనందంగా గమనించాను.

సృష్టికర్త ఎవరోనాకు తెలియదు. నేను కళ్ళు తెరిచింది, పుడమితల్లి ఒడిలోనే... అన్ని జీవాలూ ఆ తల్లి గర్భంనుండే ఉద్భవిస్తున్నాయి. ఆమె ఒడిలోనే మనుగడ సాగించి. ఆమెలోనే ఐక్యమౌతున్నాయి. ఈ చక్రభ్రమణం నిరంతరం అనివార్యం

అనాదిగా, నాకూ, మనిషికీ మధ్య స్నేహం... వైరం! పరస్పర విరుద్ధమైన రెండు భావనల సమ్మేళితమైన మా సంబంధం ఎంత చిత్రమైనది.

తనకి ఇష్టమొచ్చిన సృష్టికర్త రూపుని, నాలో ప్రతిబింబం చేసుకుని, పరోక్షంగా, నన్ను పూజించే ఈ మనిషే, తన దారికి అడ్డొస్తే, నన్ను అసహ్యంగా కాలితో అవతలకి తంతాడు. మనిషిలోని ఈ వింత ప్రవృత్తి ఎంత ఆలోచించినా నాకు బోధపడదు.

ఒక చోటు నుండి మరో ప్రదేశానికి, నా ప్రమేయం లేకుండా ప్రయాణిస్తూనే ఉన్నాను. అలవాటైన పరిసరాలు... అపురూపమైన స్నేహబంధాల్ని, తృటిలో త్యజిస్తూ... గుండెరాయి చేసుకుని, ప్రకృతి ఆజ్ఞను శిరసావహిస్తునే ఉన్నాను. ఏ మజిలీ అయినా తాత్కాలికమే.

అలా సాగిన నా ప్రయాణం ఓ ప్రాంతంలో ఆగింది. కొన్నివేల వసంతాల పూర్వం... ఆ ప్రదేశం ఎంతో మనోజ్ఞం... మనోహరం! ఎటు చూసినా నాతోబుట్టువులే? పచ్చికబయళ్ళు... ఆకాశంవైపు చేతులు చాసున్నచెట్లు... ఆ చెట్లవైపు ఒకింత అసూయగా చూసే పొదలు.. గల గల పారే సెలయేళ్ళు... ఎగిసిపడే జలపాతాలు... చిర పరిచితమైన జంతుప్రపంచం! రాచరిక వ్యవస్థ! అధిక పురపురని అంశం నా జీవనపథంలో... ధైర్యసాహసాల్ని సిరికి తనాన్ని, వైభోగాన్ని దారిద్ర్యాన్ని, క్షమతనీ, క్రూరత్వాన్ని త్యాగాల్ని స్వార్థాల్ని, జనన మరణాల్ని అన్నిటినీ నా పరిధిలోనే మూగగా వీక్షించాను. మంచిని మానవతని చూసి ఆనందించానుదౌర్జన్యం దానవత్వాల్ని నిరసించాను అన్నీ నాలోనే.

వేట, మిషతో మూగజీవాల్ని రాజులూ బుట్లూ, అమానుషంగా నెల కూలుస్తుంటే, హృదయం ఆక్రోశించేది.

తను ప్రభువు సౌఖ్యంకోసం చెట్లు పుట్టలూ

మోర్తల ప్రభాకర్ రెడ్డి

నాశనం చేసి, నిడిది గృహాలు నిర్మిస్తుంటే మనస్సు చివుక్కుమనేది.

ఏ రాణిగారి ముక్కుచ తీర్చడం కోసమో, ఏ ఉంపుడుగత్తె వగల శగల పర్యవసానమో... ఏ రాజ గురువు అభీష్టం మేరకో... నా బొంట్లని సిండి చేసి విలాసమందిరాలు. విజయస్తంభాలు... కడుతుంటే, నేనెంత కుమిలిపోయేదాన్ని.

నా బాధ నేను అంతరిస్తానని కాదు... కేవలం రాజులు, శ్రీమంతుల విలాసాలకీ ఆభిజాత్యానికి మాత్రమే. నేను పరిమితమవ్వాలా? సామాన్యుడికి కూడా ఉపయోగపడాలని ఆరాటపడేదాన్ని.

కాలం దొర్లింది... వ్యవస్థ మారింది. రాచరికాలు అంతరించి ప్రజాప్రభుత్వాలు అవతరించాయి ఎట్టకేలకు సామాన్యుడికి న్యాయం జరిగే రోజు వచ్చిందనీ... అతని అభివృద్ధికోసం నావంతు సాయం అందించే తరుణం వచ్చిందని ఎంతో ఆశతో ఆనందంతో, ఆత్రంగా ఎదురుచూసిన నాకు— నిరాశా, నిస్పృహలే మిగిలాయి.

ఇక అసలు కథ...

ఆరోజు అకస్మాత్తుగా మెళుకువ వచ్చింది. ఏదో అలజడి చూస్తూండగానే రెండు వాహనాల నిండా మనుష్యులు వాళ్ళల్లో వాళ్లే ఏదో తర్కించుకుంటున్నారు. కొందరు నా తల మీద మరికొందరు ఛాతీ మీదా... మరికొందరు మరోచోటా ఎక్కారు... ఏవో తాళ్ళలాటి వాటితో నన్ను ఓ చివరినుండి మరో చివరి వరకూ కొలిచారు. ఏవేవో లెక్కలు వేస్తున్నారు. కాగితాల మీద గీస్తున్నారు.


ఓ గంట తర్వాత నామీద ఓ ఎర్రటి ద్రవంతో గుర్తులు పెట్టారు. అప్పుడు మొదలైంది రంపపు కోత. గుర్తుపెట్టిన ప్రకారం నన్ను నిర్దాక్షిణ్యంగా నరికి, నా తల్లి ఒడిలోంచి మొరటుగా పెకిలించి ఓ చిత్రమైన శకటం మీదికి తరలించారు. ఓవైపు అంగాంగాల్లో భరించలేని బాధ తల్లి నుండి ఎడబాటుకి తల్లడిల్లుతున్న హృదయం ఏం జరుగుతుందో తెలియని అయోమయం... ఆ చిత్రవధ పగవారికి కూడా వద్దు.

అరణ్యం నుండి నాగరిక ప్రపంచం వైపుగా నా ఆఖరిప్రయాణం మొదలైంది. మూడురోజులు సాగింది ఆ యాత్ర. ఆ కొద్ది సమయంలోనే నవనాగరిక సమాజపుతీరు తెన్నులూ.. వేషబాషలూ.. అన్నీ గ్రహించాను.

ప్రస్తుత సమాజంలో రాళ్ళూ రప్పలూ డబ్బుతో కొంటారని తెలిసి ఆశ్చర్యం వేసింది. కొన్ని వందల సంవత్సరాల క్రితం తయారైన నేలెడు విగ్రహాన్ని లక్షలరూపాయలకు కొనే మహానుభావులున్నారని తెలిసి మరింత ఆశ్చర్యం కలిగింది. తన సృజనాత్మకతకి మాత్రమే విలువ కట్టడం నేర్చుకున్నాడు మనిషి. కోట్ల సంవత్సరాల నుండి పడి ఉన్న రాయికి ఏ విలువా లేదా? అది రూపాంతరం చెందితేనేనా విలువ? ధనదాహంతో అహంకారంతో నిండిన మనిషి మనసు ప్రకృతి అందాల్ని... సృష్టిలోని అద్భుతాల్ని గమనించి, ఆనందించి, అభినందించే స్థితిలోలేదు.

నన్ను ఓ మహానగరానికి తరలించడానికి లక్షల రూపాయలు ఖర్చుచేస్తున్నారట... దారి పొడవునా .. రోడ్లు వంతెనలూ మరమ్మత్తు చేశారట... నన్ను మోసుకెళుతున్న వాహనానికీ, ఇతర ఏర్పాట్లకి డబ్బుని నీళ్ళలా వృధా చేస్తున్నారు. నా అంగాంగాలూ తొలిచి, మలిచి బుద్ధ భగవానుడి ఆకృతి కల్పించి నన్నో సరస్సు మధ్య ప్రతిష్టిస్తారట ... ప్రపంచంలోనే అదో అద్భుతమట...! ఎవ్వరిదీ ఆలోచన? ఎందుకీ వృధాశ్రమ.. ఖర్చు?

రాజరికం అంతరించలేదు... కేవలం వేషభాషలు మారాయి. వ్యవస్థ అదే మనుష్యుల మనస్తత్వాలూ... ఆలోచనలూ అవే... సామాన్యుడి జీవనసరళిలో ఏ మార్పూలేదు. అదే నిరాశ అదే వైరాగ్యం అర్థంకానీ పరమార్థం లేని మనుగడ...



బుద్ధుడి ఆకృతి దాల్చడం ఓవైపు ఆనందం కలిగించినా ఆ మిషతో కొందరు మనుషులు వేస్తున్న దోపిడీని... గారడీనీ తెలిసి కూడా పెదవి విప్పలేని నా నిస్సహాయతపై నాకే బాధ... ఏవగింపు కలిగాయి..

నాలుగో రోజు నగరం చేరాను... ఎక్కడ చూసినా జనం వింతగా... వినోదంగా... చూస్తున్నారు... నాలో క్షణకాలం గర్వం సంతోషం కలిగాయి. వాళ్ళ కళ్ళలో కన్పిస్తున్న సంభ్రమం ఓ విధమైన పవిత్ర భావన నన్నెంతో ఉద్వేగానికి లోనుచేశాయి. వీళ్ళకోసం నేను అన్నీ భరిస్తాను. ఇక ఏ.రంపపుకోతా, ఉలిపోట్లు, సుత్తిదెబ్బలు నన్నుబాధించవు. నా సర్వం త్యాగం చేస్తాను. మనసారా మనిషి ఆశయానికి సాయపడతాను.

ఓ సరస్సు దాని మధ్యలో ఏదో పీఠం... నీటినుంచి భరించలేని దుర్గంధం. పచ్చటి జిడ్డోడుతున్న అసహ్యమైన మురుగునీరు వాహనాల రణగొణ ధ్వనులు... కాలుష్యంతో తన స్వచ్ఛతను ఏనాడో కోల్పోయిన గాలి... ఆకాశం..!

ఈ భయంకరమైన పరిసరాలలోనా నన్ను ప్రతిష్టించేది...? ఇక్కడేనా నేను జీవిత పర్యంతం దుర్భర... ఒంటరి జీవితాన్ని గడపాల్సింది?

రోజులూ... నెలలూ... సంవత్సరాలూ... గడిచాయి... నాకో ఆకృతి కల్పించే పని మందకొడిగా సాగుతోంది. ప్రజలూ... అధికారులూ... మంత్రులూ, పూజారులు... ఇంకా ఎందరెందరో వస్తున్నారు. ఎవరికి తోచింది వాళ్ళు చెబుతున్నారు, వెళ్ళుతున్నారు. ప్రతి నిత్యం లక్షల రూపాయల వ్యయం చాటుగా కొందరు మాట్లాడుకున్న సంగతులు నా చెవిన పడ్డాయి.

నన్ను ఎగరానికి తరలించేందుకు అసలు అయిన ఖర్చుకీ, ప్రభుత్వం చూపిన ఖర్చుకీ ఎక్కడా పొంతన లేదట. నాలుగింతలు ఎక్కువ చూపించారట. ఎవరెవరికి ఎంత భాగమో వాళ్ళు వర్చించుకోవడం చూసి నాకు ఆవేశం పెల్లుబికింది.

చాలాకాలం పాటు ప్రజలు నా అతీగతీ మర్చిపోయారు. ఏదో ప్రభుత్వం మారిందట. నన్ను ప్రతిష్టించే కార్యక్రమం... అందుకు అయ్యే వ్యయం గురించి కొత్త ప్రభుత్వం వర్చించి నిర్ణయిస్తుందట. ఎంతో కాలయాపన చివరికి కొత్త ప్రభుత్వం ప్రణాళిక కొనసాగించాలని నిర్ణయించిందట. .. అంటే మళ్ళీ దోపిడీ, మోసం ప్రారంభం.

నేను భయపడిన రోజు రానే వచ్చింది. సరస్సు నడిబొడ్డున ఉన్న పీఠం వరకూ నన్ను తరలించే కార్యక్రమం. అందుకు నాలుగు కోట్ల రూపాయల ఖర్చని తెలిసి విస్తుపోయాను.

మనుషుల్లో నిలువెల్లా పేరుకుపోయిన దురాశ దనదాహం అధికారపు ముసుగులు వాళ్ళు చేసే అకృత్యాలూ... కుట్రలూ కుతంత్రాలకీ నేనో మూగ సాక్షిని.

ఓ పవిత్ర కార్యక్రమాన్ని కూడా తమ స్వార్థానికి, స్వప్రయోజనానికి వినియోగించ వెనుకాడని నీచ నాయకులూ, వాళ్ళకి చేయూత నిచ్చే అధికార నికృష్టులు...

ఓ ఘోర ప్రమాదం కొందరు అభాగ్యుల మరణం... నరకం లాంటి సరస్సులో నా విడిది... తల్లుల గర్భకోశం... భార్యల ఆక్రోశం... బంధువుల ఆవేదన... పసిపిల్లల రోదనలతో పరిసరాలు ప్రతిధ్వనించాయి. పరోక్షంగా ఆ దుర్ఘటనకి నన్నే కారణంగా చేసి కొందరు తమ బాధ్యత నుంచి తప్పుకున్నారు. ఆ దుర్ఘటన యాదృచ్ఛికమా...? ఏదైనా కుట్ర ఫలితమా...? అందుకు బాధ్యులు ఎవరు...? తెరవెనుక వ్యక్తులెవరైనా ఉన్నారా? వ్యయం అయిన కోట్ల రూపాయల్లో ఎవరికి ఎంత

భాగం? ఇవన్నీ ఎప్పటికీ జవాబు ఉన్నా, బయటికి రాని ప్రశ్నలుగానే మిగిలిపోతాయి. మిగలకపోతే కొందరు మిగలరు.

బుద్ధుడికన్నా వాళ్ళ విగ్రహాలే వాళ్ళ భజనపరుల ముందుగా ప్రతిష్టించాల్సి రావచ్చు.

కొంతకాలం అంతా నన్ను మళ్ళీ మర్చిపోయారు. ఉన్నట్టుండి మళ్ళీ హడావిడి మొదలైంది. ఎన్నో ఏర్పాట్లు మరెన్నో ముహూర్తాలు నాకు చలనం వచ్చింది. కొంతదూరం అలవాటైన ఆ దుర్గంధ భరితమైన పరిసరాల్లోనే ముందుకు వెళ్ళి... .. అకస్మాత్తుగా ఆగిపోయాను. ఆలోచనలు మాత్రం ఆగిపోలేదు వాలో.

ఇన్ని కోట్ల రూపాయల వ్యయంతో ఎవరి కోసం ఈ ఆర్భాటం ప్రపంచంలో ఈ దేశానికి ప్రత్యేకత లేదా? వేల సంవత్సరాల చరిత్ర చెప్పిన పాఠాలు పెడచెవిన పెట్టి... మతకలహాలూ... కులాల కుమ్ములాటలూ... ప్రాంతీయ భాషా విద్వేషాలూ ఏర్పాటు వాదాలూ మరెన్నో సంకుల సమరాల ఆలవాలమైన ఈ దేశం ఔన్నత్యం అందరికీ తెలిసిందే?

పేదరికం, విధి వ్రాత అని, ఆకలి ఓ శాపం అని నమ్మి తమ దుస్థితికి లోలోపలే కుమిలిపోతూ నికృష్టమైన బ్రతుకులీడ్చే అమాయక జనాల్ని తమ మాటలగారడీతో మభ్యపెట్టి తమ పబ్బంగడుపుకునే నాయకులున్న ఈ దేశం ప్రపంచంలోనే మేటి.

తిండికీ, బట్టకీ, నీడకీ నోచుకోని కోట్లాది అభాగ్యులున్న ఈదేశం గొప్పదనం వేరే చాటాలా?

అంటరాని తనం, నిరక్షరాస్యతా, వరకట్నం, నిరుద్యోగం, ఆరోగ్యం, ఆహారం ఇన్ని సమస్యలు ప్రపంచంలో మరే దేశానికైనా ఉన్నాయా...?

ఇన్ని విషయాల్లో గొప్ప అయిన ఈదేశం... ఇంకా ప్రత్యేకతలకీ.... విశిష్టతలకీ ప్రాకులాడ్డం దేనికి...?

నాకూ ఈదేశానికి 'మోక్షం' ఎప్పుడో...?

◆

## రికార్డు సృష్టిస్తున్న బాల రచయిత



పదమూడో ఏట అడుగుపెట్టిన వంద్రహాన్ చౌదరి వేయికిపైగా కవితలు, వంద కథలురాసి రికార్డు సృష్టించాడు. మూడేళ్ళ వయసులోనే తనలోని రచయితకు జీవం పోశాడు ఆ బాలుడు.

ప్రత్యేకమైన క్రియేటివిటీని సంతరించుకున్న వందన్, వ్రాసిన పుస్తకాలు పెద్దల ప్రశంసలు అందుకున్నాయి. మొదటి సారిగా 'వాట్ యామ్ ఐ' అనే వలపై పంక్తులున్న కవితను వ్రాసి తండ్రికి చూపాడు. అది చదివి అతనిలో అసాధారణ ప్రతిభను గుర్తించి, కొడుకు వ్రాసిన ప్రతి రచనను జాగ్రత్తగా ఫైల్ చేస్తూ ప్రోత్సహించేవాడు రాహన్ చౌదరి

ఇప్పటివరకు పదిహేను వందలకు పైగా కవితలు, నాలుగు వందలు చిన్న కథలు, పన్నెండు నవలలు, మరో ఫుల్ లెన్త్ నవల వ్రాశాడు. ప్రస్తుతం మరో రెండు నవలలు రాస్తున్నాడు. ఒకటి, 'ఆండీ హొవర్డ్' అనే పన్నెండేళ్ళ కుర్రాడు తన ముగ్గురు మిత్రులతో కలిసి చేసే సాహసాలు, మరో నవల "ఓ కుక్క జీవిత చరిత్ర" (యాన్ ఆటో బయోగ్రఫీ ఆఫ్ ఎడాగ్) గురించి.

ఇతని నాలుగు నవలలు లీడింగ్ నేషనల్ డైలీలో సీరియల్ గా ప్రచురించారు. వివిధ పబ్లికేషన్ల, ద్వారా ఇతని షార్ట్ స్టోరీస్ ప్రచురించబడ్డాయి. "హయిసెన్" అనబడే ఆంథాలజీ ఆఫ్ ఇండియన్ పొయిట్రీలో వందన్ కవితా సంపుటాలకు స్థానం కల్పించబడింది. ప్రముఖ కవులు నిస్సిమ్ ఎజాకిల్, జయంతా మహాపాత్రా వంటి వారి సరసన వందన్ పేరు కూడ చేర్చబడిందంటే ఆలోచించండి అతని ప్రజ్ఞ ఎంతటిదో.

గొప్ప రచయితల స్థాయికి ధీటుగా నా రచనలు కూడా నిలుస్తాయి అంటూ తన రచనా సామర్థ్యం మీద అచంచల విశ్వాసాన్ని ప్రకటిస్తున్నాడు ఈ బాల మేధావి. ప్రతిరోజూ క్రమం తప్పకుండా తన రచనా వ్యాసంగాన్ని సాగిస్తున్నాడు. నేటి పాఠ్యాంశాలు చాలా లోపభూయిష్టంగా ఉన్నాయంటు విమర్శిస్తున్నాడు.

వందన్ మొట్ట మొదటినవల 'జెరిమీ ఆలీవర్ అండ్ ఆల్ఫ్రెడ్ జి" ఆల్ఫ్రెడ్ షా ముత్తాత ప్రేతాత్మ పదిహేడేళ్ళ క్రికెటర్‌ను ఆవహించటం ఈ నవల కథాంశం. దీనిలో హైలైట్ ఏమిటంటే ఆల్ స్టార్స్ XI మరియు ఘోస్ట్లీ విన్నర్స్ XI ల మధ్య క్రికెట్ ఫైనల్ గేమ్ వర్ణన. ఫాంటసీతో కూడిన హాస్యరస కథాంశం ఆకట్టుకుంటుంది. కథకు సరిపోయేలా నిజజీవిత క్రికెటర్ల పేర్లనే మార్చి వాడిన తీరు సహజంగా ఉంది. ఉదాహరణకు... 'డబ్ల్యు.జి. గ్రేస్' అనే పేరును డబ్ల్యుజి. ఘోస్ట్‌స్టేస్‌గా మార్చాడు. ఏమాత్రం వ్యాకరణ దోషాలు ఇతని రచనలో కన్పించక పోవటం మరో ప్రత్యేకతగా చెప్పొచ్చు.

ఆర్.కె. లక్ష్మణ్, కుష్వంత్ మొదలైన ప్రముఖుల ప్రశంసలందుకున్నాయి వందన్ రచనలు. నిస్సిమ్ ఎజికిల్ వందన్‌కు ఎంతో భవిష్యత్ ఉందని కితాబు నివ్వటమే కాక మంచి పబ్లిషర్‌ను కూడా చూపుతానని భరోసా ఇచ్చారు.

తల్లిదండ్రులు పిల్లల ఆసక్తిని గుర్తించి వారిని ఆయారంగాల్లో ప్రోత్సహిస్తే, రేపటిరోజు వారు ఉన్నత శిఖరాలను చేరుకోగలుగుతారు.

**విజయ**